
RNI : APTEL/2012/52025



# సిద్దిపేట టైమ్స్

తెలుగు దినపత్రిక

thesiddipettimes2012@gmail.com THE SIDDIPET TIMES TELUGU DAILY


సిద్దిపేట(మెదక్) | 2025, జూన్ 24 మంగళవారం | ఎడిటర్ : లోక రవిచంద్ర | సంపుటి:13 | సంచిక:265 | పేజీలు : 4 | వెల : 2/-



# బనకచర్లను అడ్డుకుంటాం

## రాష్ట్ర కేబినెట్ తీర్మానం

- బనకచర్లపై ప్రభుత్వ వాదనలను అందరికీ తెలపాలని నిర్ణయం
- భరోసా ఇచ్చినందుకు రైతునేస్తం సంబురాలు
- నవంబర్ నాటికి అన్ని కలెక్టరేట్లలో తెలంగాణ తల్లి విగ్రహాలు
- పీసీ ఘోష్ కమిషన్‌కు కాళేశ్వరం వివరాలు
- హుస్నాబాద్‌లో ఇంజినీరింగ్ సీట్ల పెంపుకు ఆమోదం



**(హైదరాబాద్, ది సిద్దిపేట టైమ్స్)**

గోదావరి నదీ జలాల హక్కుల విషయంలో తెలంగాణ చుక్క నీరు కూడా వదులుకోవడానికి సిద్ధంగా లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. గోదావరి జలాలు, బనకచర్ల విషయంలో తెలంగాణ హక్కులను కాపాడుకోవడానికి చట్ట, న్యాయ పరమైన పోరాటం కొనసాగించాలని నిర్ణయించింది. ఏపీ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునే విషయంలో ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ముందు చేసిన వాదనల వివరాలను జూలై మొదటి వారంలో ప్రజాప్రతినిధులందరికీ వివరించాలని రాష్ట్ర కేబినెట్ తీర్మానించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన తెలంగాణ రాష్ట్ర మంత్రిమండలి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నది. మంత్రిమండలి సమావేశం అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు.

**రైతు నేస్తం సంబురాలు**

తెలంగాణలో వ్యవసాయం దండుగ కాదు.. పండుగ చేయాలన్న ఆలోచన మేరకు రికార్డు సమయం 9 రోజుల్లో పెట్టుబడి సాయంగా దాదాపు రూ.9 వేల కోట్లు రైతు భరోసా కింద నిధులు విడుదల చేసిన శుభ సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం పండుగ వాతావరణంలో "రైతు నేస్తం" కార్యక్రమం నిర్వహించనుంది. రైతు భరోసా విడుదలకు తొలిరోజున ఏ విధంగా రైతు వేదికల ద్వారా లక్షల మంది రైతుల సమక్షంలో కార్యక్రమం జరిపినట్టుగానే చివరి చెల్లింపు సందర్భంగా కూడా రాష్ట్ర సచివాలయం ఎదురుగా రాజీవ్ గాంధీ విగ్రహ ప్రాంగణంలో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర మంత్రిమండలి తీర్మానించింది.

వచ్చే నవంబర్ 9 వ తేదీలోపు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల ముందు తెలంగాణ తల్లి విగ్రహాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు 201 కి.మీ పొడవున్న రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది.

విభజన చట్టంలో పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న అంశాలపై సత్వరం ఉన్నతస్థాయి కమిటీలో చర్చించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి లేఖ రాయాలని తీర్మానించింది.

### కాళేశ్వరం కమిషన్ కు వివరాలు

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి న్యాయ విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కోరిన మేరకు నిర్దేశించిన గడువులోగా ప్రభుత్వం తరపున పూర్తి వివరాలు అందించాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా రాష్ట్రంలో క్రీడాభివృద్ధి, అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు వివిధ ప్రోత్సాహకాలతో రూపొందించిన స్పోర్ట్స్ పాలసీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. భారత దేశానికి స్వాతంత్రం వచ్చి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా దేశం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగాలన్న లక్ష్యంతో రూపొందించిన విజన్ 2047 కు కూడా ఆమోదం లభించింది.

రాష్ట్రంలో క్యాన్సర్ కేర్ సిస్టం అభివృద్ధి పరచాలని సంకల్పించిన నేపథ్యంలో ప్రముఖ ఆంకాలజిస్ట్ పద్మశ్రీ డాక్టర్ నోరి దత్తాత్రేయుడును ప్రభుత్వ సలహాదారుగా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

సంగారెడ్డి జిల్లాలోని ఇంద్రేశం, జిన్నారంలను మున్సిపాలిటీలుగా, ఇస్నాపూర్ మున్సిపాలిటీ అప్‌గ్రెడేషన్‌కు ఆమోదం లభించింది.

శాతవాహన యూనివర్సిటీలో 60 సీట్ల చొప్పున ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సుల ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మహబూబ్‌నగర్‌లో ఈ విద్యా సంవత్సరం నుంచి ట్రిపుల్ ఐటీకి శ్రీకారం, హుస్నాబాద్‌లో ఇంజనీరింగ్ సీట్ల పెంపు ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం. తెలిపింది. మంత్రిమండలిలో తీసుకున్న నిర్ణయాల అమలు, పురోగతిపై ఇకనుంచి ప్రతి త్రైమాసికంలో ఒకసారి సమీక్షించాలని తీర్మానించారు.

# ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

## జిల్లా కలెక్టర్ కె హైమావతి



**(సిద్ధిపేట టౌన్, సిద్ధిపేట టైమ్స్):** సిద్ధిపేట జిల్లాలో ప్రజల సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు గరీమ అగర్వాల్, అబ్దుల్ హైమద్ లతో కలిసి కలెక్టర్ ప్రజల నుండి వచ్చిన 186 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చే ప్రతి దరఖాస్తును శ్రద్ధతో పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు వాటిని పరిష్కరించేలా చూడాలని సూచించారు. పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ఆన్లైన్‌లో నమోదు చేయడం తప్పనిసరి అని తెలిపారు. అలాగే, ఏదైనా ఫిర్యాదు సంబంధిత అధికారుల పరిధిలోకి రాకపోతే దరఖాస్తుదారులకు వివరాలు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ప్రజావాణికి ముందు ఉదయం గంటపాటు వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ఇప్పటివరకు వచ్చిన ప్రజావాణి దరఖాస్తుల పరిష్కార స్థితిని శాఖల వారిగా సమీక్షించారు. ప్రజల్లో ప్రజావాణి కార్యక్రమంపై నమ్మకం పెరగాలంటే ప్రతి ఫిర్యాదుకూ సమాధానం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్‌గా జి. శ్రీధర్



**(సిద్ధిపేట టౌన్, సిద్ధిపేట టైమ్స్):** సిద్ధిపేట టాస్క్ ఫోర్స్ నూతన ఇన్స్పెక్టర్‌గా జి. శ్రీధర్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీధర్ ను అభినందిస్తూ జిల్లాలో గంజాయి సహా ఇతర మత్తుపదార్థాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, మత్తు మాయలో యువత బలికాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా సమగ్ర జాగ్రత్తలు తీసుకోవాలని, సమాచార సేకరణ వ్యవస్థను మరింత శక్తివంతం చేయాలని ఆమె ఆదేశించారు. పీడీఎస్ రైస్, ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, దీనిపై పటిష్ఠ నిఘా ఏర్పాటు చేసి దోపిడీని అరికట్టాలని సూచించారు. జిల్లాను మత్తుపదార్థాల రహిత జిల్లాగా అభివృద్ధి చేయడంలో టాస్క్ ఫోర్స్ కీలకంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో టాస్క్ ఫోర్స్ తన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆకాంక్షించారు.

# జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్



**(సిద్ధిపేట టౌన్, సిద్ధిపేట టైమ్స్):** సిద్దిపేట జిల్లా కలెక్టర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కె. హైమావతి, జిల్లా కోర్టు భవనంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమాదేవిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా జడ్జికి పూల మొక్కను అందించి సాదరంగా అభినందనలు తెలిపారు. ఈ ఆత్మీయ సమావేశంలో ఇద్దరు అధికారులూ జిల్లా అభివృద్ధి, న్యాయ వ్యవస్థ సమర్థంగా పని చేయడం, న్యాయం త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావడం, శాంతిభద్రతల పరిరక్షణ, మహిళా భద్రత, మైనర్ కేసుల పరిష్కారాలు, న్యాయ సేవల సులభ లభ్యత వంటి అనేక కీలక అంశాలపై చర్చించారు. జిల్లాలో పాలనా వ్యవస్థ, న్యాయ వ్యవస్థ సమన్వయంతో పని చేయడం వల్ల ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమన్న ఆశాభావాన్ని ఇరువురూ వ్యక్తం చేశారు.

# విద్యాసంస్థల సమీపంలో పొగాకు విక్రయాలు నిషేధం

- సిద్ధిపేటలో టొబాకో ఉత్పత్తులపై పోలీసుల ఆకస్మిక తనిఖీలు
- 8 షాపుల నుండి సిగరెట్లు, బీడీలు స్వాధీనం



**(సిద్ధిపేట టౌన్, సిద్ధిపేట టైమ్స్):** సిద్ధిపేట పట్టణంలో విద్యా సంస్థల పరిసరాల్లో ధూమపాన ఉత్పత్తుల విక్రయాన్ని నియంత్రించాలని ఉద్దేశంతో పోలీస్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వన్ టౌన్ ఇన్స్పెక్టర్ వాసుదేవరావు, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఉపేందర్ ల నేతృత్వంలో ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల పరిసర ప్రాంతాల్లో 100 మీటర్ల పరిధిలో ఉన్న పాన్ షాపులు, టీ స్టాళ్లు, కిరాణా దుకాణాల్లో టొబాకో ఉత్పత్తుల విక్రయంపై దృష్టి సారించారు. విద్యార్థులను చిన్న వయసులోనే ధూమపాన అలవాట్లకు దూరంగా ఉంచాలని ఆలోచనతోనే ఈ తనిఖీలు చేపట్టినట్లు వారు వివరించారు. దాదాపు 8 దుకాణాలలో విక్రయిస్తున్న సిగరెట్లు, బీడీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థులను చిన్న పిల్లలను దురలవాట్లకు దగ్గర చేసే ఇలాంటి పొగాకు ఉత్పత్తులను ఎవరు విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యాసంస్థల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయించడం నేరమని ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని వారు స్పష్టం చేశారు.



# ఈవీఎంలు పరిశీలించిన కలెక్టర్

**(సిద్ధిపేట టౌన్, సిద్ధిపేట టైమ్స్):** సోమవారం జిల్లా కలెక్టర్ కె. హైమావతి కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాంను పరిశీలించారు. నెలవారీ పరిశీలనలో భాగంగా గోదాం చుట్టూ కలియ తిరిగారు. లాగ్ బుక్ చెక్ చేసి విజిటర్స్ రిజిస్టర్ లో సంతకం చేశారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం చుట్టూ సీసీ కెమెరాల పనితీరు సరిగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈవీఎం గోదాముల చుట్టూ భద్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పోలీసు అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# అవార్డుల కోసం పోటీ పడండి

## కలెక్టర్ హైమావతి

- గ్రామపంచాయతీలకు కలెక్టర్ సూచన

**(సిద్ధిపేట టౌన్, సిద్ధిపేట టైమ్స్):** నేషనల్ పంచాయతీ అవార్డుల కోసం జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలు పోటీలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కార్యాలయ సముదాయ సమావేశ మందిరంలో జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆమెతోపాటు అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 9 థీమ్‌లలో పావర్టీ ఫ్రీ, హెల్తీ, చైల్డ్ ఫ్రెండ్లీ, వాటర్ సఫీషియంట్, క్లీన్ అండ్ గ్రీన్, సెల్ఫ్ సఫీషియంట్ ఇన్‌ఫ్రా, సోషలీ సెక్యూర్డ్, గుడ్ గవర్నెన్స్, ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీలకు గాను ప్రతి గ్రామం కనీసం ఒక్క థీమ్‌కైనా దరఖాస్తు చేయాలని, ప్రతి మండలంలోని పంచాయతీలు అన్ని థీమ్‌లకు అప్లై చేయాలని సూచించారు. అవసరమైన డేటాను హార్డ్ కాపీల్లో సమర్పించాలని, అన్నిస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం వనమహోత్సవం కార్యక్రమం కోసం మొక్కలు నాటాలని చెప్పారు.



ముఖ్యంగా ఈత, మునగ మొక్కలు నాటాలని, కొత్తగా వేసిన సీసీ రోడ్ల ఇరువైపులా ప్లాంటేషన్ చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో లబ్ధిదారుల్లో అపోహలు తొలగించేందుకు అధికారులు నమ్మకం కల్పించాలన్నారు. అలాగే డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు డ్రైడే యాక్టివిటీలతో పాటు బ్లీచింగ్, స్ప్రే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీసీఈఓ రమేశ్, డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, డీపీఓ దేవకీదేవి, హౌసింగ్ పీడీ దామోదర్ రావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# మంత్రి పొన్నం వ్యాఖ్యలపై జాగృతి, యూపీఎఫ్ గరం గరం

## బీసీల రిజర్వేషన్ల కోసం పోరాటం చేస్తున్న కవితపై నోరు పారేసుకుంటారా?

- 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్రంపై మీరు చేసిన ఒత్తిడి ఏమిటో చెప్పండి
- ఢిల్లీకి అఖిలపక్షాన్ని ఎందుకు తీసుకెళ్లలేదు




**(హైదరాబాద్, ది సిద్దిపేట టైమ్స్) :** బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ఉద్యమిస్తున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై యునైటెడ్ పూలే ఫ్రంట్, తెలంగాణ జాగృతి నాయకులు మండిపడ్డారు. యూపీఎఫ్, తెలంగాణ జాగృతి మంత్రి వ్యాఖ్యలను నిరసిస్తూ వేర్వేరు వీడియో సందేశాలు విడుదల చేశారు. తెలంగాణ జాగృతి యువజన విభాగం కన్వీనర్ సంపత్ గౌడ్, నాయకుడు దుగుట్ల నరేశ్ ప్రజాపతి, యూపీఎఫ్ నాయకులు పెద్దాపురం కుమారస్వామి, సూరంపూడి సుజాత గౌడ్, సల్వాచారి, రామకోటి, సీమ రమేశ్ కురుమ, రాసమల్ల బాలకృష్ణ స్పందిస్తూ.. బీసీ రిజర్వేషన్లకు కేంద్ర కేబినెట్ ఆమోదం కోసం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఏడాదిన్నరగా వివిధ ప్రజాస్వామిక రూపాల్లో ఉద్యమిస్తున్నారని గుర్తు చేశారు. తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ప్రజా ఉద్యమాలకు తలొగ్గే రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీ, కౌన్సిల్ లో బిల్లులు ప్రవేశ పెట్టిందన్నారు. అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదించిన బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ మంత్రిగా పొన్నం ప్రభాకర్ చేసిన ప్రయత్నాలు ఏమిటో చెప్పాలని నిలదీశారు. ఢిల్లీకి అఖిలపక్షాన్ని ఎందుకు తీసుకెళ్లలేదని.. బీసీ మంత్రిగా ఎందుకు ముఖ్యమంత్రిపై పొన్నం ఒత్తిడి తీసుకురాలేకపోయారో ప్రజలందరికి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఇటీవల ప్రధానిని కలిసినప్పుడు పలు ప్రాజెక్టుల గురించి వినతిపత్రం ఇచ్చారే తప్ప బీసీ రిజర్వేషన్లకు చట్టబద్దత గురించి ఎందుకు అడగలేదో చెప్పాలన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ ఎమ్మెల్సీ కవిత జూలై 17న రైల్ రోకోకు పిలుపునిచ్చారని యునైటెడ్ పూలే ఫ్రంట్, తెలంగాణ జాగృతి నాయకులు తెలిపారు. నాలుగున్నర దశాబ్దాలుగా బీసీ ఉద్యమాల్లో ఉన్న ఆర్. కృష్ణయ్యను కలిసి రైల్ రోకోకు మద్దతు కోరారని, అందులో తప్పేం ఉందని నాయకులు నిలదీశారు. కవిత ఉద్యమానికి బీసీలంతా అండగా నిలవాలని ఆర్. కృష్ణయ్య పిలుపునివ్వడం ముఖ్యమంత్రి, మంత్రులకు మింగుడు పడటం లేదని.. అందుకే కవితపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండానే పంచాయతీ ఎన్నికలు పెట్టే ప్రయత్నాలు చేస్తూ రిజర్వేషన్ల సాధన కోసం ఉద్యమిస్తున్న కవితపై అవాకులు చెవాకులు పేలడాన్ని తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. బీసీ రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే తమ సత్తా చూపిస్తామని హెచ్చరించారు.

# వారాహి నవరాత్రులు

## 26-6-2025 గురువారం నుండి 4-7-2025 శుక్రవారం వరకు



జ్యోతిష శిరోమణి
డా.కలకుంట్ల రాజేశ్వర రెడ్డి




ఆషాఢ శుద్ధ పాడ్యమి నుంచి ఆషాఢ శుద్ధ నవమి వరకు రాత్రి సమయంలో వారాహీ అమ్మవారిని పూజిస్తారు. వీటిని గుప్తనవరాత్రులు అంటారు. నాలుగు ముఖ్యమైన నవరాత్రుల్లో ఆషాఢంలో వచ్చే వారాహి నవరాత్రి ఒకటి. మన పురాణాల ప్రకారం శక్తికి ఉన్న ఏడు ప్రతిరూపాలే సప్తమాతృకలు. వీరే బ్రాహ్మి, మాహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండి. కొన్ని నమ్మకాల ప్రకారం ఎనిమిదో మాతృకగా నారసింహినీ మరి కొన్ని సంప్రదాయాలలో తొమ్మిదవ మాతృకగా వినాయకినిని ఆరాధిస్తున్నారు. దుష్టశిక్షణ కోసమూ, భక్తులకు కాచేందుకు ఈ సప్తమాతృకలు సిద్ధంగా ఉంటారు. వీరిలో ఒకరైన వారాహి విశేషాలు.

**వరాహుని స్త్రీతత్వం**

పూర్వం హిరణ్యాక్షుడనే రాక్షసుని సంహరించి, భూలోకాన్ని ఉద్ధరించిన విష్ణువు అవతారమే వరాహమూర్తి. ఆ వరాహమూర్తికి ఉన్న స్త్రీతత్వమే వారాహి అంటారు. దేవీ భాగవతం, మార్కండేయ పురాణం, వరాహ పురాణం వంటి పురాణాలలో ఈమె ప్రసక్తి కనిపిస్తుంది. ఆయా పురాణాలలో అంధకాసురుడు, రక్తబీజుడు, శుంభనిశుంభులు వంటి రాక్షసులను సంహరించడంలో ఆమె పాత్ర సుస్పష్టంగా కనిపిస్తుంది.

**రూప విశిష్టత**

వారాహి రూపం ఇంచుమించు వరాహమూర్తినే పోలి ఉంటుంది. ఈమె శరీరఛాయను నల్లని మేఘవర్ణంలో ఉన్నట్లు పేర్కొంటారు. సాధారణంగా ఈ తల్లి వరాహ ముఖంతో, ఎనిమిది చేతులతో కనిపిస్తుంది. అభయవరద హస్తాలతో.. శంఖము, పాశము, హలము వంటి ఆయుధాలతో దర్శనమిస్తుంది. గుర్రము, సింహము, పాము, దున్నపోతు వంటి వివిధ వాహనాల మీద ఈ తల్లి సంచరిస్తుంది.

**ఆరాధన విధానము**

తాంత్రికులకు ఇష్టమైన దేవత వారాహిమాత. అందుకే ఈమెను రాత్రివేళల్లో పూజించడం కద్దు. వారాహిమాత ముఖ్య దేవతగా ప్రతిష్ఠించిన కొన్ని ఆలయాలలో దర్శనం సైతం రాత్రివేళల్లోనో, తెల్లవారుజామునో మాత్రమే ఉంటుంది. దేశంలోని వివిధ ప్రాంతాలలో ఈమె ఆలయాలు ఉన్నప్పటికీ చౌరాసి (ఒడిశా), వారణాసి, మైలాపుర్లలో ఉన్న ఈమె ఆలయాలకు ప్రాధాన్యత ఎక్కువ.

**శక్తి రూపాల్లో ఒకరు వారాహి**

అమ్మవారి శక్తిరూపాల్లో వారాహి దేవి ఒకరు. ఈమెను సప్త మాతృకలలో ఒకరిగా, దశమహావిద్యల్లో ఒకరిగా పూజిస్తారు. ఈమె వరాహ (పంది) ముఖం కలిగి ఉంటుంది. ఈమెను లక్ష్మీ దేవి స్వరూపంగా కూడా పూజలందిస్తారు. వరాహ స్వామి అర్ధాంగి అయిన వారాహిని నేపాల్ లో బారాహి అని పిలుస్తారు. ముఖ్యంగా ఈ అమ్మవారిని తాంత్రిక పద్ధతుల్లో పూజిస్తారు.

దేవీ మాహాత్మ్యంలో ఉన్న శుంభనిశుంభ వధ కథ ప్రకారం దేవుళ్ళ శరీరాల నుంచి వారి స్త్రీ రూప శక్తులు ఉద్భవిస్తాయి. శివుడి నుంచి శివాని, విష్ణువు నుంచి వైష్ణవి, బ్రహ్మ నుంచి బ్రహ్మణి.. ఇలా వరాహ స్వామి నుంచి వారాహి ఉద్భవించింది. రక్తబీజుడిని చంపడం కోసం దుర్గా దేవి సప్త మాతృకలతో కలిసి పోరాడుతుంది. ఎరుపు వర్ణం చర్మంతో గేదె వాహనంగా చేతులలో ఖడ్గం, డాలు, అంకుశం ధరించి ఉంటుంది వారాహి.

దేవీ మాహాత్మ్యంలోని తర్వాత జరిగిన కథ ప్రకారం రక్తబీజుడనే రాక్షసుడి సంహారం కోసం దుర్గాదేవి తన దేహం నుంచి మాతృకలను సృష్టిస్తుంది. అలా పుట్టుకొచ్చిన మాతృకలతో రాక్షసుడిని, అతడి సేనను సంహరిస్తుంది.

వామన పురాణాం ప్రకారం మాతృకలు అమ్మవారి రూపమైన చండిక నుండి ఉద్భవిస్తారు. వీపు భాగం నుంచి వారాహి ఉద్భవించింది.

మార్కండేయ పురాణం ప్రకారం వారాహి వరాలనిచ్చే తల్లి, వివిధ దిక్కులను మాతృకలు కాస్తారు అని చెప్పే స్తోత్రంలో ఈమె కాచేది ఉత్తర దిక్కును.

మత్స్యపురాణం ప్రకారం ఈమె జననం భిన్నంగా ఉంది. ఈ పురాణం ప్రకారం ఈమె అంధకాసురుడనే రాక్షసుడ్ని సంహరించేందుకు సహాయం కోసం శివుడు సృష్టించిన శక్తిగా చెబుతారు.

**సైన్యాధ్యక్షురాలు**

లలితాదేవికి సైన్యాధిపతిగా వారాహిదేవిని వర్ణిస్తారు. అందుకే ఈమె ప్రస్తావన లలితాసహస్రనామంలో కూడా కనిపిస్తుంది. ఆ లలితాదేవి తరఫున పోరాడేందుకే కాదు, భక్తులకు అండగా ఉండేందుకు కూడా ఒక గొప్ప యోధురాలిగా నిలుస్తుంది వారాహి. ఈమెను ఆరాధిస్తే జీవితంలో ఎదురయ్యే అడ్డంకులన్నీ తొలగిపోతాయనీ, శత్రుభయం ఉండదనీ, జ్ఞానం సిద్ధిస్తుందనీ, కుండలినీ శక్తి జాగృతమవుతుందనీ... తరతరాలుగా నిలిచి ఉన్న నమ్మకం. వారాహిదేవి పేర ఉన్న మూలమంత్రాలను, అష్టోత్తరాలనూ పఠిస్తే సకలజయాలూ సిద్ధిస్తాయన్నది భక్తులకు అనుభవమయ్యే విషయం

వామాచారం పాటించే భక్తులు రాత్రిపూట తాంత్రిక పద్ధతులలో వారాహిని పూజిస్తారు. ప్రతి మనిషిలోనూ వారాహీశక్తి నాభి ప్రాంతంలో ఉంటూ మణిపూర, స్వాధిష్ఠాన, మూలాధార చక్రాలను ప్రభావితం చేస్తుంది.

## గజ్వేల్‌లో యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ వారోత్సవాలు




**(గజ్వేల్, ది సిద్ధిపేట టైమ్స్):** యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ వారోత్సవాల సందర్భంగా సోమవారం సిద్ధిపేట జిల్లా గజ్వేల్ లో ఏసిపి నర్సింలు, ఇన్స్పెక్టర్లు సైదా, ముత్యం రాజు, ఎమ్మార్వో శ్రవణ్ కుమార్ గర్ల్స్ ఎడ్యుకేషన్ హబ్ గజ్వేల్ విద్యార్థినులతో కలసి ఎడ్యుకేషన్ హబ్ నుండి గజ్వేల్ మొల్ల విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. మానవ హారంగా ఏర్పడి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గజ్వేల్ ఏసిపి నర్సింలు మాట్లాడుతూ.. పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలని తెలిపారు. యువత ఎంతో బంగారు భవిష్యత్తు కలిగి ఉండవలసిన వారు కొంతమంది చెడు మార్గాల వైపు ఆకర్షితులవుతున్నారని, మత్తుకు అలవాటు పడి గంజాయి అలవాటు చేసుకుని జీవితాలు నాశనం చేసుకుంటున్నారని వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు సేవించే వారు వారి మానసిక స్థిమితాన్ని కోల్పోయి నేరాలు చేసే అవకాశం ఉంటుందన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు మానవుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని నరాలు గుండె సహా ప్రధాన అవయవాలు దెబ్బతినే అవకాశం ఉన్నదని తెలిపారు. గ్రామాలు పట్టణాలలో మాదకద్రవ్యాల విషయములో యువతను దూరంగా ఉంచాలని డ్రగ్ రహిత తెలంగాణ సమాజం కొరకు అందరూ కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ హబ్ ప్రిన్సిపల్ వనిషా, ఉపాధ్యాయులు పోలీస్ స్టేషన్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చేర్యాల అభివృద్ధికి సహకరించండి

### మంత్రి వివేక్ ను కలిసిన మాజీ ఎమ్మెల్యే రాజలింగం



**(చేర్యాల, ది సిద్ధిపేట టైమ్స్):** ఇటీవల గనులు, కార్మిక, ఉపాధి శాఖ మంత్రిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన గడ్డం వివేక్ వెంకటస్వామిని హైదరాబాద్ లోని ఆయన నివాసంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాజలింగం గౌడ్, కిరణ్ లు చేర్యాల ప్రాంతంలో నెలకొన్న సమస్యల గురించి మంత్రికి వివరిస్తూ 2018లో చేర్యాలలో సమీకృత భవనం నిర్మాణ పనులు ప్రారంభించినప్పటికీ ఏండ్లు గడుస్తున్నా పనులు మధ్యలోనే ఆగిపోవడంతో ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే పనులు ప్రారంభించేలా చూడాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అలానే చేర్యాలలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రిని త్వరలోనే ప్రారంభించేలా చూడాలని, చేర్యాల ప్రాంతంలో పెద్ద మొత్తంలో ఉన్న కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రోగులు డయాలసిస్ కోసం, గర్భిణీలు స్కానింగ్ కోసం జనగామ, ఆలేరు, సిద్ధిపేట, హైదరాబాద్ వెళ్తున్నారని రోగుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ ను ఏర్పాటు చేయాలని, రేడియాలజీ, ఆర్థోపెడిక్ వైద్యులను కూడా ఏర్పాటు చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. చేర్యాల అభివృద్ధికి ప్రత్యేకంగా రివ్యూ మీటింగ్ అవసరమని చెప్పినట్లు పేర్కొన్నారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి దర్శనానికి రావల్సిందిగా కోరగా సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే వస్తానని చెప్పారు.

## మహిళా భద్రత చట్టాలపై విద్యార్థులకు అవగాహన




**(చిన్నకోడూరు, సిద్ధిపేట టైమ్స్):** చిన్నకోడూరు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు మహిళల భద్రత, చట్టాలపై సోమవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నకోడూరు ఏఎస్ఐ వెంకట్ గౌడ్, సిద్ధిపేట షీ టీమ్ సభ్యులు ఏఎస్ఐ కిషన్, మహిళా కానిస్టేబుళ్లు శిరీష, మమత, కానిస్టేబుళ్లు ప్రవీణ్, లక్ష్మీనారాయణ పాల్గొని విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. విద్యార్థులకు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, డ్రగ్స్, మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే నష్టాలు, సోషల్ మీడియాలో వచ్చే మోసాలు, అపరిచితుల ఫోన్ కాల్స్/మెసేజెస్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మహిళల భద్రత కోసం షీ టీమ్ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలిపారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని గుర్తుచేశారు. విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి, చదువుపై దృష్టి సారించాలని సూచించారు. చదువుతోనే భవిష్యత్తు బాగుంటుందని విద్యార్థులకు వివరించారు. చెడు అలవాట్లకు బానిస కాకుండా ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ లక్ష్మయ్య, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నిధులు మంజూరైనా రోడ్డు నిర్మాణం చేపట్టరా..?

### బీఆర్ఎస్ నేత కల్యాణ్ కార్ నర్సింగ్ రావు

- మున్సిపల్ కమిషనర్ కు కాలనీవాసుల విజ్ఞప్తి



**(గజ్వేల్, ది సిద్ధిపేట టైమ్స్):** సిద్ధిపేట జిల్లా గజ్వేల్‌ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని తొమ్మిది, పదవ వార్డుల్లో గతంలో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణం చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కల్యాణ్ కార్ నర్సింగ్ రావుతో కలిసి సోమవారం మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య కు కాలనీ వాసులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ... తొమ్మిది, పదవ వార్డుల్లో గతంలో సీసీ రోడ్ల నిర్మాణం కొరకు బడ్జెట్ విడుదలైంది కానీ నేటికీ రోడ్ల నిర్మాణం పనులు ప్రారంభించలేదు. ఎస్.సి కాలనికి పోయే ఈ రోడ్డు నిత్యం ప్రజలతో రద్దీగా ఉంటుంది. సీసీ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, వర్షాకాలం కావడం వల్ల రోడ్డుపైన వర్షపు నీళ్లతో బురదమాయమై మెయింటెనెన్స్ లో బాగు చేయాల్సినటువంటి సిసి రోడ్లను చేయకుండా వదిలేయడం వల్ల సీజనల్ వ్యాధికి ప్రజలు గురవుతున్నారని తెలిపారు. త్వరగా వార్డులో రోడ్డు పనులు ప్రారంభించి అక్కడక్కడ సరిగా లేని మురికినీటి కాలువలను కూడా బాగు చేసి కాలనీవాసుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. పాత కూరగాయల మర్కెట్ వద్ద ఈ రోడ్డు చాలా ఇరుకుగా ఉండటంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ రోడ్డును విస్తరించాలని కోరారు. కాలనీ వాసులు మనోహర్, ఉప్పల శ్రీనివాస్, నర్సింలు, నాయిని రాములు, మేర శ్రీనివాస్, మల్లారెడ్డి, శంకర్, తదితరులు మున్సిపల్ కమిషనర్ ను కలిసిన వారిలో ఉన్నారు.

## తాటి చెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి గాయాలు



**(చేర్యాల, ది సిద్ధిపేట టైమ్స్):** ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి గాయలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దరాజుపేట గ్రామానికి చెందిన కొయ్యడ చంద్రం గౌడ్ (48) రోజు వారి పనిలో భాగంగా సోమవారం తాటిచెట్టు ఎక్కి దిగుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి గీత కార్మికులు హుటాహుటిన ప్రథమ చికిత్స కోసం చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్య చికిత్స కోసం సిద్ధిపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్ కుమార్ గౌడ్ తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన చంద్రం గౌడును ప్రభుత్వం ఆదుకోవాలని అరుణ్ గౌడ్, గ్రామస్తులు, గౌడ కులస్థులు కోరుతున్నారు.

## వలస కూలీ అంత్యక్రియలకు ఆర్థికసాయం

### మానవత్వం చాటుకున్న ప్రగతినగర్ కాలనీవాసులు



**(హైదరాబాద్, ది సిద్ధిపేట టైమ్స్):** బిహార్ వలస కూలీ మృతి చెందడంతో దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని ప్రగతి నగర్ కాలనీ వాసులు మానవత్వంతో ముందుకొచ్చి ఆర్థిక సహాయం అందించి దహనసంస్కారాలు చేయించారు. బిహార్ నుంచి వలస వచ్చిన కూలీలు కొన్నేళ్లుగా ఇక్కడ ఉన్న నోటరీ ప్లాట్లలో నివాసం ఉంటూ రోజు వారి కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. ఈ బిహారీ కుటుంబాలకు చెందిన ఓ వయోవృద్ధుడు అనారోగ్యంతో సోమవారం చనిపోయాడు. అంతిమ సంస్కారాలకు కూడా డబ్బులు లేకపోవటంతో కాలనీ అసోసియేషన్ ను సంప్రదించారు. కాలనీ వాసులు మానవత్వంతో స్పందించి ఎవరికి తోచినవిధంగా వారు సహాయాన్ని అందించారు. కాలనీ వాసులు అందించిన సహకారంతో ఆ వృద్ధుడి దహన సంస్కారాలు నిర్వహించి దాతల ద్వారా వచ్చిన డబ్బులు ఖర్చులకుపోగా మిగిలినవి వారి కుటుంబ సభ్యులకు అందించారు. ప్రగతి నగర్ కాలనీ వాసుల దాతృత్వాన్ని పలువురు అభినందించారు.

## చిరస్మరణీయుడు శ్యామ్ ప్రసాద్

### బీజేపీ పట్టణ అధ్యక్షులు కర్క తిరుపతి రెడ్డి



**(చేర్యాల, ది సిద్ధిపేట టైమ్స్):** జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా చేర్యాల పట్టణ కేంద్రంలో బీజేపీ నాయకులు ఆయన ఫొటోకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్క తిరుపతి రెడ్డి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ గురించి వివరించారు. కాశ్మీర్ కోసం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఎన్నో పోరాటాలు చేశారన్నారు. దేశవ్యాప్తంగా అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించి తన ప్రాణాలు అర్పించిన గొప్పవ్యక్తి ముఖర్జీ అని కొనియాడారు. ఒకే దేశం, ఒకే రాజ్యాంగం, ఒకే ప్రధాని అంటూ ఏక్ భారత్ అనే నినాదంతో అందరిని ఏకతాటిపై తీసుకురావడానికి కృషి చేసిన గొప్ప వ్యక్తి డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ అన్నారు. దేశం గర్వించదగిన నేతల్లో శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఒకరిని కొనియాడారు. ఆయన సాధన కోసం గాను ప్రతి కార్యకర్త అంకితభావంతో ముందుకు వెళ్తూ కృషి చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి హజరైన పార్టీ శ్రేణులకు మొక్కలను పంచిపెట్టి వాటిని నాటి చెట్లుగా ఎదిగేంత వరకు సంరక్షించాలని ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో బీజేపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నర్రా మహేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు అంకుగారి శశిధర్ రెడ్డి, పోతుగంటి రాందాస్, పుర్మ సంజీవరెడ్డి, మిట్టపల్లి ఈదిరెడ్డి, బింగి శ్రీనివాస్, మన్నే సత్యవర్ధన్, ముచ్చంతుల సిద్ధారెడ్డి, బిట్ల వెంకటేశం, శ్రీనివాస్ రెడ్డి, గుడ్ల అంజయ్య పట్టణ ప్రధాన కార్యదర్శులు పంగ సిద్దులు, కలకుంట్ల మనీష్, ఉపాధ్యక్షులు కొట్టె చంద్రమౌళి, వలిమే బాబురావు, కార్యదర్శులు వెలుగల వినయ్, రమేష్, పంగ ప్రదీప, సీనియర్ నాయకులు సయ్యద్ షాదుల్ల, కంది ప్రసాద్, పట్టణ కమిటీ సభ్యులు ఖాతా నాగరాజు, ముస్త్యాల శ్రీనివాస్, అవుశేర్లరవీందర్, శ్రీలత, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.






Editor, Printer, Publisher & Owner : L. Ravichandra, Published from : H.No.10-50,Subhashnagar Colony, Prashanthinagar, Siddipet, Dist. Siddipet - 502103
Printing at : Loka Graphics, H.No. 10-50, Subhashnagar Colony, Prashanthinagar, Siddipet, Dist. Siddipet - 502103. Editor : L. Ravichandra, Cell : 9491331533 RNI.APTEL/2012/52025